www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231





విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక


# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్



గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్



సంపుటి : 1 సంచిక : 29 03-05-2021 పుటలు : 4








# భయపడవద్దు

## మేమున్నామని భరోసా

## నన్నయ"లో సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్



కరోనా పోయింది. మళ్ళీ వచ్చింది. తిరిగి ఎప్పుడు పోతుందో? వస్తే పోతున్నారట? వ్యాధి లక్షణాలు కూడా తెలియడం లేదంటా? నాకు గానీ వచ్చుంటుందా? ఎందుకో ఈ మధ్య కొంచెం నీరసంగా ఉంటుందే? గుండె దడగా ఉంటుంది ఎందుకంటావ్? ఇలాంటి సందిగ్ధావస్థలో చాలా మంది ప్రజలు వణికిపోతున్నారు. అవగాహన, ధైర్యంతో ఎదుర్కొనే వైరస్ పై అనవసర ఆందోళన పెంచుకుంటున్నారు. దీని వల్ల శరీరంలో ఉన్న రోగనిరోధక శక్తి కూడా తగ్గి ముప్పును తెచ్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధైర్యం చెప్పడానికి ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ముందుకువచ్చింది. ఆన్ లైన్ లో సంప్రదించిన, ఫోన్ చేసినా మానసిక కౌన్సెలింగ్ ఇవ్వాలని సంకల్పించింది. సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో 40 మంది కౌన్సెలింగ్ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో భయందోళనలను, అనుమానాలను పొగొట్టేందుకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆన్ లైన్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సేవలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఛాంబర్ లో మంగళవారం ఆన్ లైన్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సర్వీసెస్ కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆచార్య ఎం. జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో స్పృహా అలుమ్ని అసోసియేషన్ సహకారంతో ఆన్ లైన్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సేవలను పున: ప్రారంభించామని అన్నారు. 24 గంటల ఆన్లైన్ కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కోవిడ్ వైరస్ భయందోళనలు, అనుమానాలు కారణంగా ప్రజల మానసిక స్థితుల్లో మార్పులు వస్తుంటాయి అటువంటి వారు ఈ ఆన్లైన్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సేవలను ఉపయోగించు కోవచ్చున్నారు. ఆందోళన, నిరాశ, భయాలు మరియు ఇతర మానసిక క్షోభ వంటి సమస్యలకు నన్నయ విశ్వవిద్యాలయం చక్కని కౌన్సిలింగ్ సేవలను అందిస్తారని తెలిపారు. కోవిడ్-19 బాధిత వ్యక్తులు మరియు వారి కుటుంబ సభ్యులకు, మెడికల్ అండ్ పారా మెడికల్ స్టాఫ్ కు, మునిసిపల్ మరియు శానిటరీ సిబ్బందికి, పోలీసులకు, ఇంటి దిగ్బంధంలో ఉన్న కుటుంబ సభ్యులకు, డయాబెటిస్, బిపి, మత్తు పదార్థల వినియోగదారులు వంటి



వ్యక్తులకు, విభిన్న మానసిక క్షోభ ఉన్న విద్యార్థులకు ఈ సైకలాజికల్ కౌన్సెలింగ్ సేవలు ఎంతో అవసరమని తెలియజేశారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో 30 మంది సభ్యులు ఆన్లైన్ కౌన్సిలింగ్ సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వారి వివరాలను వెబ్సైట్ www.aknu.edu.in లో పొందుపరచడం జరిగిందని తెలిపారు. కౌన్సిలింగ్ సేవలు అవసరమైన అభ్యర్థులు వారిని ఆన్లైన్ ద్వారా సంప్రదించవచ్చునని సూచించారు. సంప్రదించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని అన్నారు. ఆన్లైన్ కౌన్సిలింగ్ సేవలకు సహకరించిన వారికి వీసీ అభినందనలు తెలియజేశారు.

## సైకలాజికల్ కౌన్సెలర్ల జాబిత, వివరాలు

**సమయం - 08 ఉ. నుండి 11ఉ.వరకు**

| | |
|---|---|
| 1. డా. నారాయణ | 9246287989 |
| 2. బి. శ్రీనివాసరావు | 9441815973 |
| 3. దేవి అత్తిలి | 9391220799 |
| 4. కె. సుహాసిని | 9441607733 |
| 5. పి.మల్లికా దేవి | 7799581243 |
| 6. టి.గోపాల్ | 9440289036 |
| 7. కె. ఝాన్సీ | 9494548416 |
| 8. సి. హెచ్.కేశవరావు | 9603396666 |
| 9. అమ్మిరాజు | 8074908520 |

**సమయం - 02మ.నుండి 05సా.వరకు**

| | |
|---|---|
| 1. సి. హెచ్.భవానీ | 8985726938 |
| 2. రాజేష్ ఖన్నా | 9030160006 |
| 3. బి. జ్యోతి | 8555863767 |
| 4. కుసుమ | 8885355639 |
| 5. కె.అర్చన | 8333839784 |
| 6. ఆర్.చండీప్రియా | 9394234777 |
| 7. జి. అనుష | 9494008853 |
| 8. కె. సత్యకళ్యాణి | 9030835730 |
| 9. టి. సత్యహేమంత | 7501378266 |

**సమయం-11ఉ. నుండి 02మ.వరకు**

| | |
|---|---|
| 1. డా. మణిరమణ | 9885277749 |
| 2. కె. లక్ష్మి | 9397301748 |
| 3. కె.వనజ | 8374790186 |
| 4. పి.లక్ష్మిశ్రీ | 8897450050 |
| 5. దుర్గాప్రసాద్ | 8500643873 |
| 6. వై.పద్మజ | 9966535347 |
| 7. కె.భాగ్యరేఖ సిన్హా | 9121331234 |
| 8. కె.శ్రావణ జ్యోత్స్న | 9493492131 |

**సమయం-05సా. నుండి 08రా. వరకు**

| | |
|---|---|
| 1. డా.పి.రాజశేఖర్ | 9985594555 |
| 2. వి.భాస్కర్ రామ్ | 9849130006 |
| 3. టి.ఎం.ప్రసాద్ | 9848184113 |
| 4. పి.శోభన్ కుమార్ | 8886444191 |
| 5. జి. కిషోర్ | 9849220888 |
| 6. కృష్ణారెడ్డి | 8074209837 |
| 7. పి. అనుష | 8186970123 |
| 8. కె. వినీత | 7330926717 |



**24/7 అందుబాటులో ఉండే కౌన్సెలర్లు**

| | |
|---|---|
| 1. ఎస్.నాగేంద్ర కిషోర్ | 9848041486 |
| 2. దొరబాబు పివిఎస్ఎస్ | 9848109990 |
| 3. పి. సాయిరామ్ | 9490999055 |
| 4. కె. భారతరత్నమ్మ | 9959049008 |
| 5. ఎస్.రాధిక | 9848169091 |
| 6. డి.ఎస్.భారతి | 9490124046 |






# సంపాదకీయం



## మారుదాం!!

వాడవాడలా, వీధివీధికీ, అడుగడుగునా మనకు ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు.మత ధర్మాలు ఏవైతేనేంటి. ఎన్నెన్నో నిర్మించుకున్నాం.మంచి వసతుల్తో, పాలరాతి వరండాల్తో అందంగా తీర్చిదిద్దుకున్నాం.వాహనాల్ని ఎక్కడ నిల్పాలో,లగేజ్, మొబైల్ ఎక్కడ భద్రపరచాలో అన్నీ పద్ధతిగా ఏర్పాటు చేసుకున్నాం. ఏసీలు కూడా అమర్చుకున్నాం. కాసేపు మనశ్శాంతిగా ఉండటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ఆరోగ్యంగా బ్రతకడానికి మాత్రం కొన్ని ఊర్లకు కలిపి ఒక ఆసుపత్రిని మాత్రమే ఏర్పాటు చేసుకున్నాం. పడకలుండవు, సౌకర్యాలు లేవు, కనీసం ఫ్యాన్లు కూడా సరిగ్గాలేవు. గోడలు పగిలిపోయి అందులోంచి మొక్కలు కనిపిస్తాయి. డాక్టర్ల కోసం, సిబ్బంది కోసం ఎప్పుడూ శ్రద్ధ పెట్టలేదు. అలౌకికమైన విషయాల కోసం ఎన్నో ఏర్పాట్లు చేసుకున్న మనం లౌకిక విషయాలను మాత్రం వదిలేసుకున్నాం. ఇప్పుడు ఈ విపత్కర పరిస్థితుల్లో అవన్నీ మూతపడ్డాయి. కేవలం ఆసుపత్రులే పనిచేస్తున్నాయి.

కవుల్ని, పండితుల్ని, మత ధర్మాన్ని బోధించేవాళ్ళని, స్వాముల్ని గౌరవిస్తాం. పాద సేవలు చేసి, సన్మానాలు చేస్తాం. మెమెంటోలు, శాలువాలు, దండలు, బాజాభజంత్రీలు, బ్యానర్లు, బొకేలు, ఫోటోలు, వీడియోలు, భోజనాలు, బిల్లులు... అబ్బో... ఇప్పుడు వాళ్ళెవరూ కనిపించటం లేదు. మనం ఎప్పుడూ ప్రస్తావన చెయ్యని డాక్టర్లే కనిపిస్తున్నారు.పని చేస్తున్నారు.

కులం కోసం, మతం కోసం, భాష కోసం, ప్రాంతం కోసం శివాలెత్తిపోయి జుట్టు విరబోసుకుని, రొమ్ము విరుచుకుని పోరాటాలు చేస్తాం.ఎన్ని పారిభాషిక పదాలు... అస్తిత్వం, ఉనికి, పోరాటం, విప్లవం, ఉద్యమం, పిడికిలి, జెండాలు, టెంట్లు, నిరసనలు,ఓరెత్తిపోయే స్పీకర్లు, ప్రతిరోజు పత్రికల నిండా అత్యాచారాలు, అఘాయిత్యాలు, అవమానాలు, దోపిడీలు, ప్రతీకారాలు.... ఇదే మా సంస్కృతి అంటూ విర్రవీగిపోతూ ఉంటాం. సైన్స్ ని నమ్మం. గేలిచేస్తాం.సైన్స్ గురించిన కార్యక్రమాలు, అవగాహనలు వంటపట్టవు. బుర్రకెక్కవు. హెూమీబాబా సైన్స్ సిద్ధాంతాలకన్నా లోకల్ బాబా తాయెత్తుల్నే ఇష్టపడతాం. ఇప్పుడవేమీ, వాళ్లెవరూ మనల్ని కాపాడటం లేదు. సైన్స్ తప్ప. వ్యాక్సిన్లు, మందులు, ఇంజక్షన్లు తప్ప!


సున్నితంగా పాఠాల్ని నేర్చుకోవటం మానేశాం కదా....అందుకనే బండగా మృత్యువును అండగా పెట్టుకుని పాఠాలు, గుణపాఠాలు చెప్పటానికి వైరస్ లు బయలుదేరాయి. మాస్క్ వదిలేసి రిస్క్ కి రెడీగా ఉంటాం. ధైర్యాన్ని మర్చిపోయి బిక్కచచ్చిపోయి బతుకుతాం. ఇంక మనం మారం.

మూడేళ్లకో ఐదేళ్లకో పుస్తకాల్లో పాఠాలు మార్చటం ఎలాగో చేస్తున్నాం.సమాజ క్షేత్రంలో నేటి గుణపాఠాల్ని ఒంటబట్టించుకుని జీవిత పాఠాల్ని,పద్ధతుల్ని కూడా మార్చుకుందాం. ధనాన్ని, ఆస్తుల్ని, అధికారాల్ని, అహంకారాల్ని, పరుగును ఆపి ఒకసారి ప్రకృతిలోకి ప్రశాంతంగా నడుద్దాం! మార్పు కోసం ఆలోచిద్దాం!!

– డా.తలారి వాసు.

# డా.టి.వి.రమణ, బాబురావులకు కన్నీటి నివాళి

### ఆన్లైన్ లో సంతాప సభ



డా.టి.వి.రమణ, బాబురావు

**30.04.21(మీడియా సెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడలో ఎకనామిక్స్ అధ్యాపకుడు డా.టి.వి.రమణ(52), నాన్ టీచింగ్ ఉద్యోగి బాబురావు(57)లు ఇటీవల కోవిడ్ తో మృతి చెందారు. వారిరువురి మృతికి సంతాపం తెలియజేస్తూ కాకినాడ క్యాంపస్ ఆధ్వర్యంలో ఆన్లైన్ సంతాప సభను నిర్వహించారు. దీనిలో ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ కాకినాడ క్యాంపస్ లో అధ్యాపకులుగా డా.టి.వి.రమణ 16 ఏళ్ళు సేవలు అందించారని, బాబురావు నాన్ టీచింగ్ స్టాఫ్ లో సీనియర్ ఉద్యోగిగా విధులు నిర్వహించారని తెలిపారు. రమణ, బాబురావుల మృతి కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కు తీరని లోటు అని నివాళులర్పించారు. వారిరువురి ఆత్మలకు శాంతిచేకూరాలని వారి కుటుంబాలకు ఆధరణ కలగాలని కోరుకుంటూ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. విశ్వవిద్యాలయం తరుపున వారి కుటుంబాలకు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. కోవిడ్ విజృంభిస్తున్న నేపధ్యంలో విశ్వవిద్యాలయ కుటుంబ సభ్యులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో డా.టి.వి.రమణ, బాబురావు లతో ఎంతో సన్నిహిత సంబంధాలు ఉండేవని అన్నారు. అందరూ ఒకే కుటుంబంగా క్యాంపస్ లో విధులు నిర్వహిస్తూ ఉండేవారమని నివాళులర్పించారు. ప్రాంగణ ప్రత్యేకాధికారి డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ రమణ, బాబురావులు ఆకస్మికంగా కోవిడ్ బారినపడి మృతి చెందడం క్యాంపస్ ఉద్యోగులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. వారిమృతి క్యాంపస్ కు తీరనిలోటు అని నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు వీసీ ఇచ్చిన భరోసాకు క్యాంపస్ తరుపున కృతజ్ఞతలు తెలియజేసారు. తరువాత క్యాంపస్ లోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉద్యోగులు వారితో ఉన్న అనుభవాలను గుర్తుచేసుకుంటూ కన్నీటి నివాళులర్పించారు.

# బాల్యంలోనే రుగ్మతలు గుర్తించాలి

**30.04.21(మీడియా సెల్)** **రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్**

బాల్యంలోనే పిల్లల రుగ్మతలను తల్లిదండ్రులు గుర్తించి, నైపుణ్యతతో రుగ్మతలను దూరం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి రెండు రోజుల నిరంతర పునరావాస విద్య వెబినార్ ను సోమవారం ప్రారంభించారు. ఈ వెబినార్ ను జాతీయ బహుళ వైకల్యాలున్న వ్యక్తుల సాధికారత సంస్థ, సహాయ్ మానసిక వికలంగుల సంస్థ, ఠాకూర్ వి హరిప్రసాద్ ఇన్స్టిట్యూట్ అండ్ స్పృహ అలుమ్ని అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి కన్వీనార్లు గా డా. మణి రమణ సివిఎస్, డా.డి.గణేష్ బాబు, చైర్ పర్సన్ గా సుంకర కిషోర్ వ్యవహరించగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. చిన్నపిల్లల్లో మూగవ్యాధి తదితర లక్షణాలను గుర్తించడంలో తల్లిదండ్రులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాల్యంలోనే అటువంటి లక్షణాలను గుర్తించడం ద్వారా రుగ్మతలను రూపుమాపవచ్చునని చెప్పారు.

ఇటివంటి రుగ్మతలు వచ్చినప్పుడు పిల్లల స్పదనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరీక్షిస్తూండాలని, చిన్నచిన్న మెలుకవులు పాటించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. తరువాత కీనోట్ స్పీకర్ గా నచికేత రూట్, డైరెక్టర్, ఎన్ఐఇపిఎమ్డి చెన్నై, "ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ – క్లాస్ రూమ్ పరిస్థితిలో సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచడానికి వ్యూహాలు – ఇంటర్వెన్షన్ టెక్నిక్స్" అనే అంశంపై హరీష్ సింగ్, అడిషనల్ డైరెక్టర్ టిహెచ్పిఐ, "వికలాంగుల పిల్లల చట్టపరమైన హక్కులు" అనే అంశంపై ఆచార్య ఎన్.అన్నవరం, "పిల్లలకు సెన్సరీ ప్లే యాక్టివిటీస్"అనే అంశంపై సోభియావాణి, "పిల్లలలో ఆచరణాత్మక నైపుణ్యాలను మెరుగుపరిచే చర్యలు"పై బాలంబిగై ప్రసంగించారు. రెండు రోజుల వెబినార్ నిర్వహనకు సహకారనందించిన ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావుకు నిర్వహకులు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసమర్థుడు చీమ కాటుకే చచ్చిపోతాడు...
కానీ,,, సమర్థుడు సింహాన్నే తన వాహనంగా చేసుకొని అడవి దాటుతాడు. - రవి పెదపూడి



## మంచి మాట



**శరీరం జర్జరీభూతే**
**వ్యాధిగ్రస్తే కళేభరే !**
**ఔషధం జాహ్నవీతోయం**
**వైద్యో నారాయణో హరిః !!**


శరీరం శిథిలమవుతూ వ్యాధులతో నిండుతోంది. ఆ వైద్య నారాయణుడిచ్చే ఔషధమే గంగాజలంలా వ్యాధుల్ని, పాపాల్ని హరింపచేస్తుంది. ఆ సమయంలో వైద్య నారాయణుడే భగవంతుడు.



# విద్యార్థి లోకం

## ప్రతిభా వాణి

### శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య



**(7.8.1890...7.3.1979)**

గ్రంథాలయోద్యమ పితామహునిగా శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య గారు తెలుగువారందరికీ సుపరిచితులు. ఆయన గొప్ప సంఘసంస్కర్త.స్వాతంత్ర్య సమరయోధులు. పత్రికా సంపాదకులు. తూర్పుగోదావరి జిల్లా కొనకుదురులో జన్మించారు. తండ్రి వెంకటరత్నం తల్లి మంగమాంబ.


ప్రముఖ జాతీయ నాయకుడు బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాన్ని రాజమండ్రిలో విని ఉత్తేజితులై హైస్కూల్ చదువులకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్య సమర పోరాటంలో పాల్గొన్నారు. గ్రంథాలయాలు ప్రజల విశ్వవిద్యాలయాలని పేర్కొంటూ రాష్ట్రంలో పలు గ్రంథాలయాల స్థాపన, వాటి అభివృద్ధికి జీవితాంతం కృషి చేశారు. గ్రంథాలయ ఉద్యమం స్వాతంత్ర్య సాధనకు, ప్రజలను చైతన్యవంతుల్ని చేయటానికి ఉపయోగపడుతుందని భావించారు. గ్రంథాలయాల కోసం 60 ఏళ్ల పాటు శ్రమించారు. 1911లో రామమోహన గ్రంథాలయాన్ని విజయవాడలో నెలకొల్పారు. 'గ్రంథాలయ సర్వస్వం' పేరుతో పత్రికను నిర్వహించారు. అఖిల భారత పౌర గ్రంథాలయ సంఘాన్ని 1919లో స్థాపించి ఆ సంఘం తరపున 'ఇండియన్ లైబ్రరీ జర్నల్' అనే ఆంగ్ల పత్రికను నిర్వహించారు. ఆంధ్రభారతి,కొరడా పత్రికలు కూడా ఆయన నడిపిన పత్రికలు. 'గ్రంథాలయ పితామహ, సరస్వతీ సామ్రాజ్య ప్రతిష్ఠాపనాచార్య' బిరుదులతో సాహితీవేత్తలు ఆయనను సత్కరించారు. 1972 లో భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మశ్రీ' గౌరవాన్ని అందించింది. గ్రంథాలయోద్యమంతోపాటు హోమ్ రూల్ ఉద్యమం, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి రామదండు, ఆంధ్రోద్యమం, వయోజన విద్య,దివ్యజ్ఞాన సమాజం, సహకార ఉద్యమాలలో ప్రముఖ పాత్ర వహించారు. తెలుగువారి కోసం పలు ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుతో పాటు తెలుగువారి అభ్యున్నతికి, సామాజిక వికాసానికి కృషిచేసిన శ్రీ అయ్యంకి వారికి నన్నయవాణి అక్షర నీరాజనం సమర్పిస్తోంది.

# చెదిరిన సమాజం





Things Fall Apart





చెదిరిన సమాజం నవలను రచించినది నైజీరియా దేశానికి చెందిన రచయిత చినువా అచెబీ. ఆయన ఒనిట్స పట్టణానికి వాయవ్యంగా ఉన్న ఒగిడి గ్రామంలో 1930 లో జన్మించారు.ఇబదాన్ లోని విశ్వవిద్యాలయ కళాశాలలో చేరి ఇంగ్లీష్, చరిత్ర,మత శాస్త్రంతో డిగ్రీ తీసుకున్నారు.1954 నుండి నైజీరియన్ ప్రసార విభాగంలో ప్రొడ్యూసర్ గా,కంట్రోలర్ గా,విదేశీ సేవా విభాగానికి డైరెక్టర్ గా పనిచేశారు.ఎన్నో దేశాల్ని సందర్శించారు.ఆయన రచించిన చెదిరిన సమాజం 1958 లో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రచురించింది.ఆయన రచించిన థింగ్స్ ఫాల్ ఎపార్ట్,నోలాంగర్ ఎట్ ఈజ్ నవలలు చాలా ప్రపంచభాషల్లోకి అనువాదమయ్యాయి.

వివిధ జాతుల భాషలను, సంస్కృతులను, వైవిధ్యాలను నాశనం చేస్తూ తాను నిర్దేశిస్తున్న ఏకైక నమూనా జీవితాన్ని ప్రపంచీకరణ క్రమం ప్రపంచంపై రుద్దుతోంది. ఒకప్పుడు ఐక్యంగా ఉన్న ఒక తెగకు సంబంధించిన కథే 'చెదిరిన సమాజం' నవల. అప్పట్లో ఆ తెగలోని వారందరిదీ ఒకటే మాట. అందరిలో ఒకేరకమైన చైతన్యం ఉండేది. ఏం చేసినా ఐక్యంగా చేసేవారు.తెల్లవాడు వచ్చాడు.ఈ ఐక్యత భగ్నమైంది.ఐక్యత భగ్నమైన క్రమంలో ఎన్నో తలలు నేలరాలాయి. కొత్త పదాలు, కొత్త వాడుకలు, కొత్త పద్ధతులు మనుషుల హృదయాల్లోకి ప్రవేశించాయి. పాత సమాజం క్రమంగా శిథిలమయింది.

ఐరిష్ కవి డబ్ల్యు .బి.యేట్స్ రచించిన 'ది సెకండ్ కమింగ్' అనే కవితలోంచి 'చెదిరిన సమాజం' Things Fall Apart నవల శీర్షికను, వస్తువును అచెబి స్వీకరించాడు. తెల్లవాడు వ్యాపారిగా, పరిపాలకునిగా తన ఇబో సమాజంపై విరుచుకు పడిన కాలాన్ని అచెబీ వెనక్కి తిరిగి పరిశీలించారు. చెదిరిన సమాజం నవలలో ఉపయోగించిన సామెతలు, జానపద కథలతో ఒక పెద్ద జాబితా తయారు చేయవచ్చు. వారి తెగకు సంబంధించిన సంప్రదాయాలు, నిషిద్ధాల జాబితాను కూడా రూపొందించవచ్చు. మల్ల యుద్ధం,వివాహ పద్ధతి, అంతిమ సంస్కారాలు, వ్యవసాయ పద్ధతులు, కొత్త సంవత్సర పండుగలు, వారి ఆచారాలు....ఇలా ఎన్నో వర్ణనలు నవలలో ప్రతిబింబిస్తాయి. వీటన్నింటినీ కలుపుతూ అచెబి మనకు ఒక కథ చెబుతాడు. ఒక తెగ ప్రజలు చెల్లాచెదురైన కథను చిత్రిస్తాడు. తేలిక పదాలు, చిన్న చిన్న వాక్యాలు, అందమైన శైలి ఈ నవలలో కనిపిస్తుంది. చేయి తిరిగిన కథారచయిత నైపుణ్యం పాఠకుల్ని ఆకట్టుకుంటుంది.

### భారతీయులుగా

మనం మనం కలిసుంటేనే సమానత్వం...
మనం మనం విడిపోతే అది మన అమాయకత్వం...
మనం ప్రపంచానికి సాయం చేస్తూ చాటేది మానవత్వం...
ఎందుకంటే, మనందరిదీ ఇతరులను ప్రేమించే మనస్తత్వం...
మనం ఇతరులపై చూపించేది ప్రేమను పంచే బంధుత్వం...
మన శత్రువునైనా ఆపదలో నుండి రక్షించేది మన గుణం...
మనది సాయం చేసాక ఏమీ ఆశించని నైజం...
మన కష్టాలను మనమే భరించుకునే గుండె మన ఆయుధం...
ఇదే మన అందరి భారతీయులకు ధైర్యం...
మనం మనం కలిసుందాం...
భారతీయులుగా గర్విద్దాం...

ఎం.రాజేష్, బి.టెక్, సివిల్

### జాగ్రత్త సోదరా

బయటకెళ్ళి నీవు బాతాఖానీ
పెట్టమాకు..
చేతులారా జీవితాన్ని ఆపుకోకు
గమ్మునుండరా కొంపలో
సల్లగుండరా నీవు
ఆగలేక అడుగు బయట
పెట్టావంటే...అంతే నీపని.
ఇల్లు, ఒల్లు నీవు
సుబ్బరంగా ఉంచుకో..
తాగు నీరు కచ్చితంగా కాసుకో..
సబ్బు వాడరా అయ్యా...
జబ్బు వద్దురా...
షేక్ హ్యాండ్ నువ్వు
ఇవ్వకుండా మానుకో
కళ్ళు, నోరు, ముక్కును
చేతితోతాకకు దూరంగుండరా
బాబు.. తిరగమాకరా...
అబ్బె..నాకెం కాదు, నాకేం రాదు
అన్నావంటే
నీ ఫోటో మీద పెద్దదండ
పడతాదంతే.
పప్పు ఉప్పులన్నీ
ఒక్కసారే తెచ్చుకో..
ఎక్కువైతే నీ పక్కవాళ్లకిచ్చుకో
సాయం చెయ్యరా
బాబు ధర్మం చెయ్యరా...
తిండిలేక, నీరు లేక ఎందరో
మీ వీధిలోన ఉండుంటారు
చూడరో...
దానం చెయ్యరా బాబు
ఆకలి తీర్చరా...
నీకు ఉండి కూడా
పక్కవాడికెట్టకపోతే
నీవు మనిషివన్న మాట కూడా
మరిచావంతే..!!

-పి.రవికుమార్ ఎమ్.ఏ.

# చైల్డ్ మ్యారేజ్



**భారతదేశంలో బాల్య వివాహం అంటే భారత చట్టం ప్రకారం, స్త్రీ 18 ఏళ్లలోపు లేదా పురుషుడు 21 ఏళ్లలోపు ఉన్న వారికి వివాహం చెయ్యడం అని అర్థం. భారతదేశంలో బాల్య వివాహాలకు సంబంధిత చట్టాలు**

1) బాల్య వివాహ నియంత్రణ చట్టం (1929)
2) హిందూ మ్యారేజ్ యాక్ట్ (1955) లో బాల్యవివాహాలు
3) బాల్య వివాహ నిషేధం (పిసిఎంఎ) (2006)

డ్రాయింగ్ థీమ్: దయచేసి పాఠశాల వయస్సు ఉన్నప్పుడు ఆడపిల్లకు వివాహాలు చేయవద్దు. ఎందుకంటే ఇది మీరు చిన్న హృదయాలకు ఇచ్చిన శిక్ష.

భారతదేశంలో బాల్య వివాహాల పరిస్థితి


1) అంచనా ప్రకారం, ప్రతి సంవత్సరం, 18 ఏళ్లలోపు వున్నవారు కనీసం 1.5 మిలియన్ల మంది బాలికలకి భారతదేశంలో వివాహాలు చేస్తున్నారు

2) భారతదేశంలో జరిగే వివాహాలలో 16% బాలికలు 15-19 సంవత్సరాలకు సంబంధించిన వారే వుంటున్నారు

3) మహిళలపై పరిశోధన చేసిన ఇంటర్నేషనల్ సెంటర్ యునిసెఫ్ ప్రచురణలు ప్రకారం 1998 యొక్క నమూనా సర్వే నుండి భారతదేశ బాల్య వివాహం రేటు 47% గా అంచనా వేయబడింది. యునైటెడ్ దేశాలు 2005 లో దాని రేటు 30% గా నివేదించాయి

4) భారతదేశంలో సుమారు నలుగురిలో ఒకరికి వారి 18 వ పుట్టినరోజుకు ముందు యూనియన్‌లో వివాహం చేస్తున్నారు (లేదా). ప్రపంచంలోని బాల వధువులలో ముగ్గురిలో ఒకరు మన దేశం వారే.

-విన్నకోట శ్రీచరణ్ తేజ ఎమ్.ఏ.ఎకనమిక్స్, అనూర్.





(ఫోటో)- బి.బాలసువర్ణ, ఎంఎస్సీ జువాలజీ, 2018-2020

## “వరించకే కరోనా”

కరోనా! మళ్లీ ఎందుకొచ్చావ్!
కోట్ల మందిని కబళించావ్!
ఎందరినో అనాథల్ని చేశావ్!
ఉపాధిని తొలగింప చేశావ్!
రోడ్డున పడేటట్లు చేశావ్!
నిరుద్యోగుల్ని పెంచేశావ్!
ఆత్మహత్యకు పాల్పడేలా చేశావ్! అయినా
తీరలేదా నీ దాహం!
ప్రాణాలంటే ఎందుకంత మోహం!
వద్దంటే వెంట పడతావ్!
పొమ్మంటే ఫాలో అవుతావ్!
కాదంటే కూర్చుంటానంటావ్!
గడప తొక్కొద్దంటే ఇంట్లోకొస్తానంటావ్!
దరికి చేరొద్దంటే ఒంట్లో ఉంటానంటావ్!
భరించ లేనంటే నిన్నే వరిస్తానంటావ్!
గీత దాటకంటే దేశాల్ని చుట్టేస్తావ్! అందుకే...
మాస్కు పెట్టి నిన్ను మట్టు పెడతా!
సేనిటైజర్ తో నిన్ను చిత్తుచేస్తా!
భౌతిక దూరంతో నిన్ను తరిమి కొడతా!
ఆవిరి పడుతూ నీ ఆయువు తీస్తా!
టీకాతో నీకు గోరీ కడతా!
చివరికి నిన్ను భూ గ్రహంపై లేకుండా చేస్తా!

**– బాలచందర్ సాదే (చంద్రశ్రీ)**
**తెలుగు శాఖాధిపతి, పెనుగొండ.**

## ఓసారి గుర్తుచేద్దురూ..

కుప్పగా పోసేస్తున్నా ఈ
గడ్డు కాలపు క్షణాలను
ఎవరన్నా ఆ రాతరాసిన వాడికి
తిరిగి ఇచ్చిరండి.
చితికిన బతుకులకు మాట్లు వేసే యంత్రాన్ని
సృష్టించమని కాస్త గట్టిగా చెప్పిరండి.
కాలం చెల్లిన జీవితాలను
భరోసా ముగిసిన ఆశల కట్టలను..
ఏ విధాత వడ్డీ కట్టి బాగుచేస్తాడో...
ఏ ఈశుడు గీత సరిచేసి నవ్వులు పూయిస్తాడో
అడగండి..ఎవరైనా అడిగేరండి....
రోడ్డు పక్కన పాత కుండలు
ఎన్ని ఓడు పోయాయో
ఎందరి శ్వాసలు ఓడి'పోయాయో'
ఆగిపోయిన భవంతుల నీడల్లో ఎందరు బిక్క
చిక్కిన మనుషులు దాక్కున్నారో
ఎన్ని బిక్క చచ్చిన వృథలు
నల్లరంగు
పులుముకున్నాయో
ఎక్కడెక్కడో వుండే
ఆయనకేమి ఎరుకుంటుంది
ఓసారి గుర్తుచేసిరండి...
తలుపులు మూసుకున్న ఆయన నివాసం
ముందర
ఎందరి చేతులు చాచే వీలులేక
నీలుక్కుపోయాయోజి
ఏ జంధ్యం ఎవరిని యాచించే స్థితికి
దిగజారిందో...
ఇకనైనా తెలుసుకోమని
హెచ్చరించి రండి.
ఆయన సృష్టే ఇదని
మనమాయన చేతుల్లోని కీలుబొమ్మలమేనని
కీలెరిగి పెట్టిన వాతలు ఇక చాలని, ఇకనైనా
రక్షించే పనికి పూనుకొమ్మని
గుర్తు చేయండయ్యా
గుర్తు చేయండి.....

**-నవీన్ చంద్ర హోతా**

## నియంత్రణ


పక్షిలా స్వేచ్ఛగా తిరగాలంటే
ఇంకొనాళ్లు ఇంటి పంజరంలో
అవ్వక తప్పదేమో...?
దేహంలో ప్రాణముండాలి కదా.
దానికి స్వీయ నియంత్రణే కొలబద్ద కావాలి.
మదిమదినీ జాగృతికి పట్టం కడుతూకొన్ని
నిబంధనలను
మెదడుకు మేతగా వేయాలి.
ఊరికే బయట తిరిగి...
ఉప్పెనను మోసుకువచ్చే కన్న
ఇంట్లోనిక్షేపంలాంటి కాలక్షేపంతో
కుటుంబానికి రక్షణ చక్రాన్ని అల్లుకోవాలి...
ఈ కరోనాతో పోరాట సమయాన్ని
మన అనుకూలపు సంచిలో వేసుకోవాలంటే
పిల్లల కాలానికి ఆటలకి గేలం వేయాలి
దూరం పాటిస్తూ పెద్దలు కాలాన్ని
ముచ్చట్లు ప్రవాహంలో ముంచాలి
చిరు వంటకాల్లో ప్రతిభను చూపాలి
పుస్తక ఆకురాళ్ళ పై
మస్తకానికి పదును పెట్టుకోవాలి.......!!

**-ఆర్.ఎస్, బి.టెక్.(సివిల్)**




## జయిద్దాం......!

కంటికి కనిపించని కరోనా
దూరం చేస్తుంది కన్నవాళ్ళని.
చెవులకు వినిపించే కరోనా క్రూరత్వం
చెంత చేరనివ్వదు అయిన వాళ్ళని.
మాస్క్ లేని నాసికలోకి ప్రవేశించిచేస్తుంది
అంటరాని ముద్దాయిని.
అడ్డు కవచం లేని గొంతులోకి ఆక్రమించి
గడగడలాడించి వినిపిస్తుంది గర్జనని.
ఇంద్రియాలను నిలయం చేసుకుని
విలయ తాండవం చేస్తుంది.
స్వచ్ఛమైన రక్తప్రవాహంలో రోగ
ప్రళయాన్ని సృష్టిస్తుంది.
అంటుకుంటే అంటుతుంది.
ముట్టుకుంటే ముంచుతుంది.
దానికి “కో”రల కాటులో
“రో”గిని చేసి జీవితాలను
“నా”శనం చేస్తున్న దీనికి నివారణ ఒక్కటే
మార్గం.
చేయి చేయి
వీడుదాం కరోనా
ని చేదిద్దాం!
బయటకు వెళ్ళుట
ఆగుదాం కరోనాని
అణగద్రొక్కుదాం!
ముక్కు తెరలు వాడుదాం కరోనాని మసిచేద్దాం.
మనలోని రక్షక భటులను పెంచుదాం!
మనకై పోరాడుతున్న రక్షకులకు సహకరిద్దాం!
మనలో రోగనిరోధకతను పెంచుకుందాం!
మనకై రోగనివారణకు సేవ చేస్తున్న వైద్యులను
గౌరవిద్దాం!
మనకు మనం భౌతిక దూరం పాటిద్దాం..
ఒక్కటిగా ఏకమై కరోనా ని ఎదిరిద్దాం,
జయిద్దాం....! రోగులను రక్షిద్దాం......!






**-లావణ్యనాగ్ కటికరెడ్డి,**
**మంగెన గుర్రయ్య కళాశాల**

## కరోనా...

స్వచ్ఛమైన గాలిని పీల్చే స్వేచ్ఛను
ఆపేస్తున్నావే...
ప్రాణానికి ప్రాణం అడ్డు పెట్టే వారికి
ప్రాణాపాయం తెస్తున్నావే...
రక్షణ కలిగించే వారిపైనే కక్ష సాధిస్తున్నావే...
కార్మికుల జీవితాలను నడిరోడ్డు మీద చిదిమేస్తున్నవే...
మధ్యతరగతి బ్రతుకులను ఎడారిలోకి నెట్టేస్తున్నావే...
విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నవే...
ఆత్మీయబంధాలను కనుమరుగు చేస్తున్నావే...
రక్త సంబంధీకులకు చివరి చూపునే దూరం చేస్తున్నావే...
దేశ, విదేశాలలో మృత్యు కేకలు వేయిస్తున్నావే ...
ఆకలితో ఉన్నవారి నోటిదగ్గర ఆహారాన్ని లాగేస్తున్నవే...
మూగజీవాలకు దిక్కుతోచని స్థితిని కల్పిస్తున్నవే...
భావి భారత పౌరులను నిరుద్యోగులుగా మిగులుస్తున్నావే...
నీరాకతో అంటరానితనం అంటిస్తున్నావే...
అనుమానమనే పెనుభూతాన్ని సృష్టిస్తున్నావే...
కొత్త రూపాలుగా రూపాంతరం చెంది విజృంభిస్తున్నావే...
మా కన్నీళ్ళకు తృప్తి చెందడం లేదా! మా ఆర్తనాదాలు
వినిపించడంలేదా!
ఇన్ని చేస్తున్నా మాపై నీ కక్ష తీరడం లేదా!

**-యాళ్ల యామిని**
**మంగెన గుర్రయ్య కళాశాల.**






**టి.నాగ స్పందన,**
**బి.టెక్. ఫైనల్**
**ఇయర్, సి.ఎస్.ఈ.**